సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

మనోజ్ ఉలిక్కిపడ్డాడు. కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

పోలీసు యూనిఫామ్‌లో వున్న అతని తెల్లటి జుట్టు కిటికీలోంచి వీచే గాలికి అటూ యిటూ కదుల్తోంది....

• • •

కారు ప్రచండమైన వేగంతో వెళ్తోంది. 'మిస్టర్ బెలూన్' అరితేరిన డ్రయివర్‌లా వున్నాడు. డోర్‌కీ ఫ్రేముకీ మధ్య ఇందాకటిదాకా నలిగిన యెడమచేతిని తేలిగ్గా స్టీరింగ్ మీద వుంచుకున్నాడతను.

మనోజ్ ఇబ్బందిగా కదిలాడు. చేతులు వెనక్కి విరిచి బేడీలు తగిలించబడినందువల్ల సీటుకి ఆనుకుని తిన్నగా కూచోలేకుండా వున్నాడతను.

ఎవరు వీళ్ళు? పోలీసులా? రంగంలోకి దిగినప్ప ట్నుంచీ పోలీసులు తనని వెంటాడుతున్నారా? ఎందుకు? శత్రువులు పోలీసుల్లా నటిస్తున్నారా? పోలీసులే శత్రువులా?

ఎవరైనా, తనని బోల్తా కొట్టించారు. పదిరోజుల తన ప్రిపరేషన్, మారువేషం, కుంటినడక, మితిమీరిన జాగ్రత్తా, వాళ్ళని బోల్తా కొట్టించలేక పోయాయి! క్రయిమ్ నవలల్లో హీరోలా తను ప్లాన్ చేయలేక పోయినందుకు మనోజ్ తనని కోపంతో తిట్టుకున్నాడు.

తన పక్కన అగ్గిపుల్ల వెలిగింది. తెల్లజుట్టు వ్యక్తి, న్యూస్ పేపర్ కాలీ సిగరెట్ వెలిగించాడు. కారు ఆగకుండా వెళ్ళిపోతోంది. తనని యెక్కడికి తీసుకెళుతున్నారు?

"ఎక్కడికి తీసుకెళుతున్నారు నన్ను?" మనోజ్ పక్కకి తిరుగుతూ ప్రశ్నించాడు.

తెల్లవెంట్రుకలతను అతనివైపు చూసి చిరునవ్వు నవ్వాడు. సిగరెట్ని ఇవతలికి తీసి, కిటికీలోంచి బూడిదని కింద దులిపాడు. కారు వేగం తగ్గకుండా మలుపు తిరిగింది.

మనోజ్ విసురుగా అతనిమీద పడ్డాడు. అతని మోచేయి మెరుపులా కదిలింది. మనోజ్ విసురుగా, బలంగా మూలకి కొట్టుకున్నాడు. సర్దుకుని కూచోడానికి ప్రయత్నిస్తూ మనోజ్ అతన్ని కోపంగా చూశాడు జుట్టు తెల్లబడినా చేతుల్లో చేవ తగ్గలేదు!

"ఎవరు మీరు? ఎక్కడికి తీసుకెళుతున్నారు?" మనోజ్ కోపంగా అరిచాడు.

తెల్లవెంట్రుక లతను చెవిటివాడిలా వుండిపోయాడు.

కారు స్పీడు తగ్గింది. మిస్టర్ బెలూన్ తలతిప్పి వోరగా చూశాడు.

"గురూ, నువ్వు డ్రైవ్ చెయ్. వాడి నోరు నేను మూయిస్తా!" అన్నాడతను కసిగా.

"షటప్! నీ పని నువ్వు చెయ్యి!" తెల్ల వెంట్రుక అతను గద్దించాడు.

కారు స్పీడు హెచ్చింది. సిటీలిమిట్స్ దాటి హైవేలో ప్రవేశించింది.

"మీరేం చేస్తున్నారో మాకు తెలీదు. తరవాత విచారిస్తారు...." మనోజ్ మెల్లిగా అన్నాడు. తెల్ల వెంట్రుక తలని కుడిచెయి అతని మొహంవైపు దూసుకొచ్చింది. అరచెయ్యి మనోజ్ పెదవులమీద బలంగా, వెడల్పుగా తాకింది. అతని పెదవులు బిగుసుకుపోయినట్టయ్యాయి. అడ్హెసివ్ టేప్ తన నోటిని మూసేసినట్టు మనోజ్ గ్రహించాడు. తెల్ల వెంట్రుకలతను ఖుషీగా, బిగ్గరగా నవ్వడం ప్రారంభించాడు....

'గురూ, నువ్వు డ్రైవ్ చెయ్. వాడి' అంటే వీళ్ళు పోలీసులు కారు! తెలివిగా, పోలీసుల్లా నటించి నడిరోడ్డులో తనకు బేడీలు తగిలించారు! అవమానంగా, భయంగా వున్నా లోపల్లోపల మనోజ్ కి సంతోషంగా వుంది. శత్రువు తనని, తనకి చూపిస్తున్నాడు! ఒక విధంగా తనకి శ్రమ తగ్గుతుంది. వెతుకుతున్న తీగ కాళ్ళ దగ్గరకు పాకుతోంది!

తనని ఏం చేస్తారు? తప్పించుకు రాగలడా? ఆలోచిస్తూ మనోజ్ పరిసరాల్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. తన పక్కగా కదలిక అతని దృష్టిని ఆకర్షించింది. మనోజ్ తల తిప్పబోయాడు.

దిండుగలీబులాంటి పొడుగాటి నల్లటి సంచీ అతని తలమీంచి భుజాలదాకా కిందికి దిగింది. దళసరి గుడ్డ. కటిక చీకట్లో వున్నట్లనిపించిం దతనికి. తను వెళ్తున్న పరిసరాన్ని గుర్తుంచుకునే అవకాశం తనకి లేకుండా చేశారు వాళ్ళు!

మనోజ్ గుండె రేస్‌హార్స్‌లా ఉరకలు ప్రారంభించింది. ఖంగారుని అదుక్కి తోక్కొస్తూ, తీవ్రంగా ఆలోచించటానికి ప్రయత్నించా డతను.

పరిసరాల్ని తను చూస్తే వాళ్ళకి నష్టం ఏమిటి? తరువాత, తరువాత తను ఆ ప్రదేశాన్ని గుర్తించవచ్చు. అలా గుర్తించటం వాళ్ళకి యిష్టంలేదు. అంటే తనకి 'తరువాత' అనేది వుందన్నమాట! అంటే తనని వాళ్ళు చంపబోవడం లేదన్నమాట!

మనోజ్ ఉద్రేకంతో నిట్టూర్చాడు. నిట్టూర్పు వేడి అతని మొహాన్ని తాకింది. చంపే ఉద్దేశం లేనప్పుడు తనని ఎందుకు తీసుకెళ్తున్నారు? రంగనాథ్‌కి ఇచ్చినట్టు తనకి కూడా 'మైల్డు వార్నింగ్' ఇస్తారా?

మనోజ్ మొహాన్ని కప్పిన సంచీ తటాలున పైకి లాగబడింది. మిరుమిట్లు గొలుపుతున్న కాంతిని చూడలేక అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నా డతను.

మనోజ్ కళ్ళు తెరిచాడు. పొడుగాటి హాల్లో తను నిలబడ్డాడు. నేలని తివాచీ పూర్తిగా కప్పింది. హాలు పొడవునా, మధ్యలో రెండు వరసలుగా గ్లాస్‌టాప్డ్ టేబుల్స్ వేయబడ్డాయి. వాటి వెనుక ఖరీదైన కుషను కుర్చీలు. టేబుల్ వరసల మధ్య అరడుగుల వెడల్పులో ఖాళీ జాగా వుంది.

మనోజ్ ఎదురుగా చూశాడు. టేబుల్ వరసల

చివర, అడ్డంగా వెడల్పాటి టేబుల్ వుంది. టేబుల్ ముందు ఎత్తుగా సింహాసనంలా వున్న కుర్చీలో గంభీరంగా కూర్చున్న వ్యక్తిని అతను ఆశ్చర్యంగా చూశాడు.

వెనక్కి దువ్విన గిరజాల జుట్టు. బుర్ర మీసాలు. గుబురుగా పెరిగి, మధ్యలో కలుసుకున్న కనుబొమలు అతని మీసాల్లాగే వంకీలు తిరిగున్నాయి. వాటికింద సాన పెట్టిన వజ్రాల్లాంటి కళ్ళు. బంగారు రంగులోవున్న కోటు మెరుస్తోంది. లావుపాటి బంగారు గొలుసునుంచీ వేలాడు తున్న పులిగోరు ధగధగ మెరుస్తోంది. అతను కిరీటంలేని రాజులా వున్నాడు. మనోజ్ కళ్ళు అతనిమీదే తాపడం అయిపోయాయి.

అతని మీసాలు మెల్లిగా కదిలాయి. ఎర్రటి పెదవుల సందులోంచి పళ్ళు మెరిశాయి.

“వేటకి బయల్దేరిన సింహాన్ని వెంటాడి పట్టారన్న మాట! సింహం, అతన్ని సోదా చెయ్!” అతని కంఠం గర్భగుడిలో మ్రోగించిన శంఖంలా హాల్లో ప్రతిధ్వనించింది.

రెండు చేతులు భుజాలనుంచీ కిందికి మనోజ్ ని జాగ్రత్తగా తాకుతూ వెళ్ళాయి. బెల్టునీ, జేబుల్నీ తడివాయి. పాంటు జేబులోంచి సిగరెట్ పాకెట్ నీ, లైటర్నీ తీసి అతను, సింహం—పక్కనేవున్న టేబుల్ మీద పడేశాడు. అతని చేతులు కిందికి దిగాయి. మనోజ్ కుడికాలి పిక్కప్రాంతంలో తడివి దూరంగా జరిగాయి. మనోజ్ తేలిగ్గా నిట్టూర్చాడు.

“మనోజ్ కుంటుతూ నడిచాడు బాస్. కాలికి బ్యాండేజీ వుంది” సింహం వినయంగా అన్నాడు.

“కట్టుకింద గాయం వుందో, గాయాలు చేసే వస్తు

వుందో చూద్దాం! కట్టు విప్పెయ్!" బాస్ కంఠం గంభీరంగా ధ్వనించింది.

మనోజ్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. గురువు శిష్యుల్ని మించినట్టున్నాడు.

సింహం, తెల్లజుట్టు వ్యక్తి—మనోజ్ కాళ్ళ దగ్గర గొంతుకూర్చున్నాడు. రెండు చేతుల్తో మనోజ్ పాంటుని మోకాలిపైకి తోశాడు. రెండు నిమిషాల్లో తెల్లటి బ్యాండేజీని తీసి కింద పడేశాడు. రెండు సన్నటి రబ్బరు బ్యాండ్స్‌తో కాలికి తగిలించబడిన కత్తిని చిరునవ్వుతో చూశాడు. వేళ్ళతో రబ్బర్ బ్యాండ్స్‌ని తెంచేశాడు. కత్తిని పైకెత్తి పట్టుకుని నిలబడి తన యజమానిని నవ్వుతూ చూశాడు.

బాస్ నవ్వు కన్‌సీల్డు మైగాఫోన్స్‌తో యాంప్లిఫై చేయబడినట్టు హాల్లో ప్రతిధ్వనించింది. సింహం ముందుకి నడిచి, కత్తిని బాస్ ముందు టేబుల్ మీద వుంచాడు.

బాస్ కుడిచేత్తో కత్తిపిడిని పట్టుకున్నాడు. అతని వేళ్ళకి వున్న ఉంగరాల రాళ్ళు జిగేల్మన్నాయి. ఎర్రటి వెల్వెట్ ఒరలోంచి సన్నటి కత్తిని ఇవతలికి లాగి, అటూ ఇటూ తిప్పాడతను. మెరుస్తున్న పదునుని నవ్వుతూ చూశాడు. సిల్కు జుబ్బా చేతికి పైకితోసి, ముంజేతిమీద కత్తితో రాశాడు. మెత్తటి ఈకలాగా కత్తిపదును అతని చర్మాన్ని తాకింది. తాకినంత మేరా అతని ముంజేతిమీద వెంట్రుకలు మాయమయ్యాయి. అతని తల మెల్లగా పైకి లేచింది. కళ్ళు చిట్లిస్తూ మనోజ్ వైపు చూస్తూ వుండిపోయాడతను.

మనోజ్ రెప్ప వాల్చకుండా అతన్నే చూస్తున్నాడు. కత్తిని ఒరలో దోపి, తనముందు టేబుల్ మీద పెట్టు

న్నాడతను. దృష్టిని మనోజ్ వైపు మళ్ళించి, చేతిని పైకెత్తి చూపుడువేలితో సైగ చేశాడు.

సింహాం మనోజ్ జబ్బ పట్టుకుని టేబుల్ ముందుకు నడిపించుకు వెళ్ళాడు.

"మనోజ్ నీ అన్వేషణ ఎందాకా వచ్చింది?" బాస్ కంఠంలో ఎగతాళి వినిపించింది మనోజ్ కి.

మనోజ్ లోపల్లోపలే పళ్ళు కొరుక్కున్నాడు. తన వదినను చంపి. అన్నను సర్వనాశనం చేసిన రాక్షసుడు, గీతను కాలరాచిన పిశాచం! కోర్టులో తనకి సహకరించిన బలహీనుల్ని దారుణంగా చంపిన కృతఘ్నుడు! చింత నిప్పుల్లా వున్న కళ్ళతో మనోజ్ అతన్ని తీక్షణంగా చూశాడు.

"మనుషుల్ని నల్లుల్లా చంపుతున్న నరరూపరాక్షసుడి దాకా వచ్చింది!" మనోజ్ గర్జించాడు.

ఏదో జోక్ విన్నవాడిలా అతను పగలబడి నవ్వాడు. నగిషీలు చెక్కిన చిన్న పెట్టెలోంచి కరోనా సిగార్ తీసి వెలిగించాడు. నోటినిండుగా పీల్చిన పొగని కాలుతున్న చుట్ట కొనమీదికి ఊదాడు. కొన ఎర్రగా మండింది.

"మనోజ్ నువ్వు అనుకున్నంత తేలిగ్గా నేను మనుషుల్ని చంపను!" చుట్టకొసనే చూస్తూ అన్నాడతను "నువ్వు అన్వేషిస్తున్న వ్యక్తి నేను కాను!"

మనోజ్ ఆశ్చర్యంగా చూశాడు. ఏమిటిదంతా? నాటకమా?

మనోజ్ వెటకారంగా నవ్వాడు. "రాజమ్మ, మస్తాన్ రావు, కృష్ణంరాజు చాలా తేలిగ్గా చంపబడ్డారు"!

(ఇంకా వుంది)